వాయిస్ టుడే

హైదరాబాద్
సోమవారం, 30 జూన్ 2025



## సేవాదళ్ జండా ఆవిష్కరించిన మిద్దెల జితేందర్

ఎల్బీనగర్ జూన్ 29 (వాయిస్ టుడే ) దేశవ్యాప్తంగా ప్రతి నెల చివరి ఆదివారం సేవాదళ్ జెండా ఆవిష్కరించడంలో భాగంగా ఎల్బీనగర్ లో సేవాదళ్ జెండాను ఆదివారం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ఆవిష్కరించడం జరిగింది. ఎల్బీనగర్ సేవాదళ్ అధ్యక్షులు పల్లె అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో అఖిలభారత కాంగ్రెస్ ,రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి గాంధీ భవన్ ఇంచార్జీ, బండి సురేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమా కాంతారావు స్వామి ముదిరాజ్,యూసుఫ్,వై వెంకటేష్ గుప్తా యాదయ్య చారి ,ఎం డి ఫహీం అయూబ్ ఖాన్, ఆవుల మల్లేష్, పి. రాజుఅక్రమ్ ఆనంద్ వివిధ డివిజన్ ల అధ్యక్షులు పాల్గొన్నారు



## కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా: కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 137 జతల కోడెలను 274 జీవాలను అధికారులు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ రాధాభాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ అగస్త్య పీఠం వారాహి అమ్మ వారి కుంకుమ పూజ



నరసింహరావు పాలేం( కంచికచర్ల): ఆషాఢ మాసం అమ్మవారి సారే కార్య క్రమానికి హాజరు కావడం పునర్జన్మ సుకృతం వారాహి అమ్మ వారి నవరాత్రులు సందర్భంగా కుంకుమ పూజలు సుగుణానంద గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మంది మహిళలు అమ్మ వారి సారె కార్య క్రమంలో మరియు వారాహి అమ్మ వారి కుంకుమ పూజలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు బట్టీ విక్రమార్క సతీమణి మల్లు నందిని వారాహి అమ్మవారి సారె పూజ కార్య క్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సుగుణానంద గాయత్రి స్వామి నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ బి కోటి మరియు భక్తులు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుండి పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# మ్యాన్ హోల్స్ కావవి... మ్యాన్ కిల్లింగ్ హోల్స్

### మ్యాన్ హోల్స్ గుంతలతో చింత

### ఆదమరిస్తే అంతే

### అస్తవ్యస్తం అడ్డదిడ్డం

### కాంట్రాక్టర్ల ఇష్టారాజ్య నిర్మాణం..!

### అధికారుల పర్యవేక్షణా లోపం..

### ప్రజలకు ప్రమాదాల శాపం...!!



సూర్యాపేట, జూన్ 29(వాయిస్ టుడే ప్రతినిధి)బీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్మించిన రోడ్ల మధ్యన ఏర్పాటుచేసిన మ్యాన్ హోల్స్ మ్యాన్ కిల్లింగ్ హోల్స్ గా మారాయి. రోడ్ల మధ్యలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఎక్కడైనా మురుగు నీటి రవాణాలో అంతరాయం ఏర్పడితే మ్యాన్ హోల్స్ ద్వారా సమస్యను పరిష్కరించడానికి రోడ్ల మధ్యలో నిర్మించిన మ్యాన్ హోల్స్ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. సరైన ఇంజనీరింగ్ ప్లానింగ్ లేకపోవడం, మ్యాన్ హోల్స్ నిర్మించేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లోపం వలన కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా, ఇష్టారాజ్యంగా, ఎట్లబడితే అట్లా అస్తవ్యస్తంగా, అడ్డదిడ్డంగా మ్యాన్ హోల్స్ నిర్మించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మ్యాన్ హోల్స్ అస్తవ్యస్త నిర్మాణం ఒక చిన్న సమస్యగా కనిపించినప్పటికీ దానివల్ల జరిగే ప్రమాద తీవ్రత మాత్రం భవిష్యత్ తరాలకు శాపంగా మారి సంవత్సరాల తరబడి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఒక శాస్త్రీయ పద్ధతిలో నిర్మించకుండా హడావుడిగా, నాణ్యత లోపంతో నిర్మించడం వలన మ్యాన్ హోల్స్ ఒక దగ్గర లోతుగా, మరో దగ్గర ఎత్తుగా ఉండి రోడ్లపై ప్రయాణించే వారికి నరకం చూపించడమే కాదు ప్రమాదాలు జరిగి గాయాల పాలు కూడా ఆయిన సంఘటనలు నిత్యం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కోకొల్లలు గా జరుగుతున్నాయి.

**ప్రజలలో చైతన్యం సన్నగిల్లిందా...**
**ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా..!!**

చైతన్యానికి ప్రతీకగా, ప్రశ్నించే తత్వానికి పునాదిగా నిలవాల్సిన సూర్యాపేట ప్రాంత ప్రజలలో నిజంగా అవేర్నెస్ ఎందుకు తగ్గిపోతుందో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది అని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సొమ్ముతో నిర్మించే రోడ్లు కావచ్చు, మ్యాన్ హోల్స్ కావచ్చు నాణ్యత లోపంతో నిర్మించడం వల్ల సొమ్ము వ్యర్థం కావడమే కాకుండా భవిష్యత్తులో త్వరగా పాడైపోయి మళ్లీ ప్రజాధనానికి తూట్లు పొడిచే అవకాశం ఉంది. తన దాకా వస్తే గాని తెలియదు అన్న చందంగా నిత్యం ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వయా మెయిన్ రోడ్, పాత జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ రోడ్డు, ఖమ్మం క్రాస్ రోడ్ నుండి కొత్త బస్టాండ్ వరకు, ఇంకా పలు వీధులలో నిర్మించిన, నిర్మిస్తున్న మ్యాన్ హోల్స్ అన్నీ కూడా అస్త వ్యస్తంగా, అడ్డదిడ్డంగా ఉన్నాయని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి వారు లోలోపల అనుకుంటున్నారు తప్పించి ఏ రాజకీయ పార్టీ గాని, ఏ స్వచ్ఛంద సంస్థ గాని నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సరైన ఇంజనీరింగ్ లేకుండా నిర్మించిన మ్యాన్ హోల్స్ పై ప్రశ్నించకపోవడం కాదు కనీసం సంబంధిత అధికారులకు వినతి పత్రాలు కూడా సమర్పించలేని స్థితిలో, కనీసం ఆందోళన చేపట్టలేని స్థితిలో ఉన్నామంటే ఎక్కడికి పోయింది ఈ ప్రాంత చైతన్యమని, ఎటు పోతుంది ప్రజాస్వామ్యం అని పలువురు వాపోతున్నారు. కాంట్రాక్టర్లు ఆడింది ఆటగా, పాడింది పాటగా తూతూ మంత్రంగా మాన్ హోల్స్ నిర్మిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నప్పటికీ బాధ్యత కలిగిన రాజకీయ పక్షాలు ఎందుకు ఈ విషయంలో మౌనంగా ఉంటున్నాయి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లోపం ఏ పనిలోనైనా జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాల్సిన, కర్రు కాల్చి వాత పెట్టాల్సిన అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు చేయి తడిమితే చాలు, మాకు ఎవరూ ఎదురులేరు, ఇష్టం వచ్చినట్టుగా మ్యాన్ హోల్స్ కట్టుకుంటూ పోతామనే ధీమాతో కాంట్రాక్టర్లు వ్యవహరించారా అన్న సందేహాలు కూడా కలుగక మానవు. మ్యాన్ హోల్స్ నిర్మించిన కాంట్రాక్టర్ మాత్రం నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుగా ఎట్లానో ఒకలా, ఏ విధంగానో తామరాకుపై నీటి బొట్టు చందంగా పని కానించుకొని వెళ్ళిపోయాడు కానీ నిత్యం అదే రోడ్లమీద తిరుగుతున్న ప్రజలు మాత్రం అష్ట కష్టాలు పడుతున్నారు.

**ఎత్తు పల్లం తో మ్యాన్ హోల్స్...**
**ప్రజలేమో ఆసుపత్రుల పాలు...**
**వాహనాలేమో షెడ్ల పాలు...!!**

ఏ ఒక్క చోట కూడా సరైన పద్ధతిలో జిల్లా కేంద్రంలో కరెక్ట్ గా మ్యాన్ హోల్స్ నిర్మించిన చరిత్ర లేదని ప్రజలు వెల్లడిస్తున్నారు. ఎగుడు దిగుడుగా, ఎత్తు పళ్ళెంతో, కొన్నిచోట్ల మరీ ఎత్తుగా, అక్కడక్కడ రోడ్డుపై వదిలేసిన భారీ గుంతలతో నిత్యం వాహనదారులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో కుటుంబాలతో సహా రోడ్డు మీద పడిపోయి ఆసుపత్రుల పాలైన సంఘటనలు జరుగుతున్నాయి. మ్యాన్ హోల్స్ గుంతలలో గుద్దుకుని వాహనాలు రిపేరింగ్ షెడ్లకు తరలుతున్నాయి. వాహనాలే కాకుండా వాహనంపై ప్రయాణించే ప్రజలు కూడా వెన్నుపూస డిస్కులు కదిలి ఎముకల ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇలా నిత్యం జరుగుతున్న ప్రమాదాల వలన వాహనాలు, ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతూ ఆర్థికంగా సతమతమయ్యే పేద కుటుంబాలలో మరింత ఆర్థిక భారం పెరిగి మూలిగే నక్కపై తాటి పండు చందంగా పరిస్థితి తయారయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అస్తవ్యస్త మ్యాన్ హోల్స్ నిర్మాణానికి పరిష్కారం ఏమిటో..?**

అస్తవ్యస్తంగా, అడ్డదిడ్డంగా శాస్త్రీయ పద్ధతి లేకుండా నిర్మించిన మ్యాన్ హోల్స్ కాంట్రాక్టర్ పై తక్షణం సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యాపేట ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. రోడ్లు గాని, మ్యాన్ హోల్స్ గాని నిర్మించినప్పుడు ప్రజలకు కొన్ని సంవత్సరాల పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉచితంగా సర్వీస్ అందించే నిబంధనలు కూడా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇచ్చిన ఒప్పంద మార్గదర్శకాలలో రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ విధిస్తుంది. ఎక్కడైనా రిపేర్ చేయాల్సి వచ్చినా, కొత్తవి వేయాల్సి వచ్చినా కాంట్రాక్టర్ తనకు మంజూరైన బడ్జెట్లోనే చేయాల్సి ఉంటుందనే నిబంధనలు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఒప్పందంలో తెలియజేస్తుంది. ఇలా పలు రకాలుగా నిబంధనలను విధించి పకడ్బందీ గా విధి, విధానాలు ప్రభుత్వం రూపొందించినప్పటికీ, అవినీతికి అలవాటుపడ్డ అధికారుల అలసత్వమో, ప్రజల సొమ్మును అందిన కాడికి దోచుకొని కాంట్రాక్ట్ పనిని తూతూ మంత్రంగా పూర్తిచేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో కానీ నాణ్యత లోపంతో పనులు చేయటం ప్రస్తుత ప్రజాస్వామ్యంలో పరిపాటిగా మారిందనే విమర్శలు లేకపోలేదు. నాణ్యత లోపంతో పలుమార్లు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టే చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుంటుంది. ఇన్ని రకాలుగా ప్రభుత్వం కట్టుదిట్టంతో కఠిన నియమాలు ఏర్పాటు చేసినప్పటికీ, కాసుల కక్కుర్తికి అలవాటుపడ్డ కాంట్రాక్టర్లు, అవినీతి సంపాదనకు అలవాటు పడ్డ అధికారుల వలన ప్రజాస్వామ్యంలో ప్రజల డబ్బు వృధాగా పక్కదారి పడుతుందని, ఈ విధంగా చేయడం వల్ల ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి నిత్యం వచ్చే గ్రామీణ ప్రాంతాల వారు కూడా జిల్లా కేంద్రంలోని అస్తవ్యస్తమైన మ్యాన్ హోల్స్ పట్ల ఆందోళన చెందుతున్నారు. ఎక్కడైతే మ్యాన్ హోల్స్ వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారో సర్వే నిర్వహించి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. మ్యాన్ హోల్స్ వలన ఎక్కడైతే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయో అక్కడ తిరిగి నాణ్యతతో రోడ్డుకు అనుసంధానంగా, సరి సమానంగా ఎగుడు దిగుడు లేకుండా ఇక్కడ మ్యాన్ హోల్ ఉందా, లేదా అన్నంత నాణ్యతతో రోడ్డులో కలిసిపోయే విధంగా కొత్త మ్యాన్ హోల్స్ ను నిర్మించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న మ్యాన్ హోల్స్ ను సరిచేసి, అవసరమైతే కొత్త వి నిర్మించి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చేస్తారని, చేయాలని మనమూ ఆశిద్దాం.

# అమిత్ షా చేతుల మీదుగా పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం

- హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పసుపు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేసిన మంత్రి తుమ్మల
- **ఆంధ్రప్రదేశ్ లో కలిసిన భద్రాచలం చుట్టుపక్క వున్న యాటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్రమంత్రిని కోరిన మంత్రి తుమ్మల**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 29: నిజామాబాద్ లో కేంద్రమంత్రి అమిత్ షా చేతుల మీదుగా పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభమయింది. ఇదివరకే రాష్ట్రంలోని నిజామాబాద్ కి పసుపు బోర్డు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, నేడు దాని ప్రధాన కార్యాలయాన్ని నిజామాబాద్ లో ప్రారంభించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిజామాబాద్ ఇంచార్జీ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. నిజామాబాద్ కి పసుపు బోర్డు ప్రకటించి, దాని కార్యాలయాన్ని కూడా ప్రారంభించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వ తరపున కృతజతలు తెలిపారు. అలాగే పసుపు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పసుపు రైతులు తమ పంటను కనీస మద్ధతు ధరకు అమ్ముకునే విధంగా ధరలలో స్థిరికరణ తేవాలన్నారు. అందుకోసం పసుపు పంటకు కనీస మద్ధతు ధర ప్రకటించాలని, మార్కెట్ నఫెడ్ వంటి సంస్థల ద్వారా నేరుగా కొనుగోళ్లను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పసుపు ప్రధానంగా పండే ప్రాంతాలలో డ్రైయింగ్ ప్లాట్‌ఫార్ములు నిర్మాణానికి కేంద్ర నిధులను కేటాయించాలన్నారు. రైతుల వద్దనే పసుపు పాలిషింగ్, గ్రేడింగ్ యంత్రాలను అందుబాటులోకి తేవడం ద్వారా మార్కెట్ విలువ పెరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అధిక కర్క్యూమిన్ శాతం, వ్యాధి నిరోధకత, ఎగుమతులకు అనుకూలత కలిగిన విత్తన రకాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తూ, ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పసుపు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

పసుపు సాగు యాంత్రీకరణ, విలువ ఆధారిత గొలుసు అభివృద్ధిపై ఐ సి ఏ ఆర్ యు జి సి మద్దతుతో పరిశోధనలకు తోడ్పాటు కల్పించాలని,

భౌగోళిక సూచిక (జి ఐ) ఆధారంగా తెలంగాణ పసుపును అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రాండ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని అన్నారు. పసుపు పంటను ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు డాక్యుమెంటేషన్‌ను సరళీకరించడం, అంతర్జాతీయ వాణిజ్య డెలిగేషన్లు, ఎగ్జిబిషన్లలో రైతుల పాల్గొనడాన్ని ప్రోత్సహించాలన్నారు.

పసుపు రైతులకు వారి స్థానిక భాషల్లో సలహాలు అందించే విధంగా మొబైల్ యాప్ లు అభివృద్ధి చేయాలని, విలువ ఆధారిత, సేంద్రీయ సాగు, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పసుపు సాగులో కార్మిక వ్యయాన్ని తగ్గించేందుకు ఎంజీ ఎన్ ఆర్ ఇ జి ఎస్ పథకంతో సమన్వయం చేయాలన్నారు. పసుపు రంగ అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పసుపు బోర్డు మరియు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రస్తుత పసుపు సాగు పరిస్థితులపై బేస్‌లైన్ సర్వేను చేపట్టి, వచ్చే ఐదు సంవత్సరాల కోసం ప్రణాళికను రూపొందించాలని అన్నారు. ఏపిలోని నాలుగు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి. ఏపి పునర్విభజన చట్టం 2014 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో కలిసిన భద్రాచలం చుట్టుపక్క గ్రామాలైన యాటపాక, కన్నాయిగూడం, పిచుకలపాడు పురుషోత్తపట్నం లను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్రమంత్రిని లేఖ ద్వారా కోరారు.

భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతుండగా, యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం అనే గ్రామ పంచాయతీలు 17 రెవెన్యూ గ్రామాలు%రి% విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని, వీటి వలన అనేక పరిపాలనా, అభివృద్ధి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా భద్రాచలం పట్టణం తెలంగాణ ప్రధాన మండలాల మధ్య రవాణా అంతరాయం ఏర్పడుతుందని, భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులకు రాకపోకల్లో రెండు రాష్ట్రాల చెక్‌పోస్టుల వల్ల గిరిజనులు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతం కావడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు కూడా ఏర్పడుతున్నాయని, భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నిర్వహణకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, ఎందుకంటే దేవస్థానం భూములు ఏపీ పరిధిలో ఉన్నాయని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, ఆ గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడం అత్యవసరమని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం తగిన చట్టపరమైన, పరిపాలనా చర్యలు తీసుకోవాలని కోరారు.